సాక్షి చిత్తూరు
మంగళవారం । 11 । మార్చి । 2025



నీ శరణిదే జొచ్చితిని!
సంగీత తపస్వి గరిమెళ్ల ఆధ్యాత్మిక గుబాళింపుగా ప్రాశస్తి చెందిన అన్నమయ్య సం కీర్తనలనే జీవితంగా మలుచుకున్నారు. - 8లో



పుత్తూరు తైలం పేరిట బురిడీ
పుత్తూరు తైలం ప్రాంఛైజీల పేరిట ఓ వ్యక్తి రూ.లక్షలు బురిడీ కొట్టించిన ఘటన పలమనేరులో వెలుగుచూసింది. - 8లో



అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ
వివిధ శాఖలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్, జేసీలు సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. - 8లో



న్యూస్‌రీల్

త్వరితగతిన విచారణ చేయండి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్: ప్రజలు ఇచ్చే వినతులపై త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. చీటింగ్, కుటుంబ తగదాలు, భూతగదాలు, భర్త వేధింపులు తదితర సమస్యలపై ప్రజలు నేరుగా ఎస్పీని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఇలా మొత్తం 41 వినతులు వచ్చాయి. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

నూనె గింజల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నూనె గింజల సాగుకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఆయిల్ సీడ్ మెషిన్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తీర్ణం, ఉత్పత్తి దిగుబడి లక్ష్యాల ఆధారంగా నూనె గింజల సాగుకు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. మండలాల వారీగా క్షేత్ర స్థాయిలో ఎఫ్‌పీఓల భాగస్వామ్యంతో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు, రైతుల ఆసక్తి, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు సంబంధిత విషయాలపై అవగాహన పెంచి, సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. నూనె గింజల సాగుకు అవసరమైన విత్తనాల పంపిణీ, రైతులకు శిక్షణ, క్లస్టర్ ఫ్రంట్‌లైన్ ప్రదర్శనల (సీఎఫ్ఎల్‌డీలు) పర్యవేక్షణ, పంట బీమా, సూక్ష్మ నీటిపారుదల, వ్యవసాయ రుణం సంబంధిత అంశాలపై చర్చించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం నూనెగింజల పంటల్లో వేరుశనగ మొదటి స్థానంలో ఉందన్నారు. తరువాత సీసం, పొద్దుతిరుగుడు గింజల సాగు, ఆయిల్ సీడ్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయ శాఖ ఏడీ సావిత్రి, నాబార్డ్ డీడీఎం సునీల్, డీటీఓ రామచంద్ర, శాస్త్రవేత్త సంధ్య, ఏడీ కోటేశ్వర రావ్, తదితరులు పాల్గొన్నారు.

17న సంకటహర చతుర్థి

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 17వతేదీన సంకటహర చతుర్థి వత్రం నిర్వహించనున్నట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. ఈ వ్రతం ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు జరపనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. వ్రత పూజల్లో పాల్గొనే భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో టికెట్లు పొందవచ్చని తెలిపారు.



● చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం బొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన విభిన్నప్రతిభావంతురాలు నాగమ్మ సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేసింది. ఆమెకు 2023-24లో గత వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో స్థలంతో పాటు ఇల్లు మంజూరు అయ్యింది. ఆమె సొంతింటిని పునాదులు, గోడల వరకు నిర్మించుకుంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఆపేశారు. దీంతో సగంలో ఆగిపోయిన ఇంటి నిర్మాణానికి బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ వ్యయప్రయాసలతో నాగమ్మ కలెక్టరేట్‌కు విచ్చేసింది. ఈమె సమస్యను సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బంది వద్దనే ఇచ్చి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంది. అయితే అలా కాకుండా ఆమె బొమ్మాయిపల్లి నుంచి చిత్తూరు కలెక్టరేట్‌కు 30 కిలోమీ వరకు వ్యయప్రయాసలతో విచ్చేసింది. అక్కడ వినే వారులేకే ఇక్కడికి రావాల్సి వచ్చింది.



● చిత్తూరు జిల్లా సోమల మండలం సోమల గ్రామానికి చెందిన ముస్లింలు సయ్యద్‌బాషా, ముబారక్‌బాషాలు 69 కిలోమీటర్లు ప్రయాణం చేసి, తమ సమస్యను విన్నవించుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేశారు. 75 ఏళ్లుగా సర్వే నంబర్ 130/5 లో 56 సెంట్ల భూమిని శ్మశానవాటికగా ఆ ముస్లింలు వినియోగించుకుంటున్నారు. ఆ శ్మశాన స్థలం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సోమల తహసీల్దార్‌ను కలిసి పలుసార్లు అర్జీలు ఇచ్చారు. ఆ తహసీల్దార్ వారికి కచ్చితమైన సమాధానం ఇచ్చి ఉంటే వారు కలెక్టరేట్‌కు వచ్చేవారు కాదు. ఆయన ఇవ్వకపోవడంతో కలెక్టరేట్‌కు పరుగులు పెట్టాల్సివచ్చింది.

సర్వేజనం.. సేవాభంగం

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు.. గ్రామాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని బాపూజీ కలలు గన్నారు. గత వైఎస్సార్ సీపీ సర్కారు ఆ కల సాకారానికి గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. క్షేత్రస్థాయిలోనే సమస్యలు పరిష్కరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మాగాంధీ కలలకు తూట్లు పొడుస్తోంది. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. సర్వేల పేరుతో సిబ్బందిని ఊరూరా తిప్పుతోంది. క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో లేక ప్రతి చిన్న సమస్యకూ ప్రజలు సుదూర ప్రాంతంలోని కలెక్టరేట్‌కు పరుగులు పెట్టేలా చేస్తోంది. ఏం చేయాలో తెలియక.. తమ బాధలు ఎక్కడ ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక జనం నలిగిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రతి చిన్న సమస్యకూ.. కలెక్టరేట్‌కే
- గ్రామ, మండల స్థాయిల్లో అమలు కాని ప్రజాసమస్యల వేదిక
- వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజలు
- గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం
- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి కుట్రలు
- పెదవి విరుస్తున్న జిల్లా ప్రజానీకం





నింద్ర సచివాలయానికి అర్జీలు ఇచ్చేందుకు విచ్చేసిన ప్రజలు, సిబ్బంది సర్వేకి వెళ్లడంతో వి.కోట అంబేడ్కర్ నగర్‌లో ఒక్కరే విధుల్లో ఉన్న మహిళా పోలీస్

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామ సచివాలయవ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి సర్కారు కుట్రలు పన్నుతోంది. ఫలితంగా జనం ప్రతి చిన్న సమస్య పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ సర్కారు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల సమస్యల పరిష్కరించడంతోపాటు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేర్చేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఈ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు కలిగింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు సచివాలయ వ్యవస్థను క్రమేణా నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తోంది. సచివాలయ ఉద్యోగులకు వివిధ సర్వేల పేరుతో పని ఒత్తిడి పెట్టి ప్రజల సేవలకు దూరం చేస్తోంది. ఫలితంగా ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల నుంచీ ఇదే తంతు జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. దీంతో ప్రతి సోమవారం దాదాపు 500 మంది వరకు జిల్లాలోని పలు మండలాల నుంచి కలెక్టరేట్‌కు సమస్యల పరిష్కారం కోసం పోటెత్తుతున్నారు. ఎలాగో మండల స్థాయి లోనైనా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయా? అని అనుకుంటే అక్కడ కూడా ప్రజలకు న్యాయం జరగడం లేదు. ప్రజలకు మేలు కోరి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలను నిర్వీర్యం చేస్తున్న కూటమిపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

సచివాలయాల్లో అడ్రస్‌లేని 'వేదిక'

సచివాలయాల్లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి సోమవారం సచివాలయ ఉద్యోగులందరూ గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందుబాటులో ఉండి, స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజా సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిలిపివేసింది. దీంతో ప్రజలు చేసేదేమి లేక ప్రతి సోమవారం వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు విచ్చేస్తున్నారు. అధికారులకు తమ సమస్యలు మొరపెట్టుకుంటున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. కలెక్టర్, జేసీలు వేదికలో వచ్చిన ప్రజల వినతులు పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ ఏమీ పట్టనట్టుగా మిన్నకుండిపోతున్నారు. ప్రజలు మాత్రం ప్రతి సోమవారం జిల్లా కేంద్రానికి విచ్చేసి సమస్యలు చెప్పుకుంటూనే ఉన్నారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరగకపోవడంతో బోసిపోయిన ఐరాల మండల సచివాలయం

జిల్లా సమాచారం

రూరల్ గ్రామ సచివాలయాలు :	504
అర్బన్ సచివాలయాలు :	108
రూరల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు:	5,040
అర్బన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు:	1,080
రూరల్‌లోని సచివాలయ క్లస్టర్లు:	7,728
అర్బన్‌లోని సచివాలయ క్లస్టర్లు:	1,618
రూరల్‌లోని కుటుంబాలు:	4,65,970
అర్బన్‌లోని కుటుంబాలు:	1,01,121
రూరల్‌లోని జనాభా:	14,58,318
అర్బన్‌లోని జనాభా:	3,22,780

పట్టించుకుంటే ఇంత దూరమెందుకొస్తాం!

మాది పెనుమూరు మండలం బొంతివంక గ్రామం. మా పాపకు ప్రస్తుతం 27 సంవత్సరాల వయస్సు. చిన్నతనంలోనే పోలియో వ్యాధి సోకింది. మా పాపకు ప్రస్తుతం రూ.6 వేలు పింఛన్ ఇస్తున్నారు. ఆ నగదు మా పాప చికిత్సకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఈ విషయాన్ని మండల అధికారులకు చెప్పినా న్యాయం జరగలేదు. దీంతో మా పాపకు రూ.15 వేలు పింఛన్ ఇప్పించాలని వేడుకునేందుకు వచ్చాం. ఉదయం నుంచి కలెక్టరేట్‌లో పాపతో నిరీక్షించి కలెక్టర్‌కు మా బాధను చెప్పుకున్నాం. గ్రామ, మండల అధికారులు పట్టించుకుని, న్యాయం చేస్తే ఇంత దూరం ఎందుకొస్తామయ్యా.



- బాలికతో తల్లి మణిమాల

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేదు

మాది గుడిపాల మండలం గట్రాలమిట్ట ఎస్టీకాలనీ. మేము గిరిజనులం. మాకు సర్వే నంబర్ 402లోని గుట్టభూమిలో గతంలో గృహాలు నిర్మించుకున్నాం. ఇప్పుడు ఆ సర్వే నంబర్ మొత్తం తనకు పట్టా ఉందని కబ్జాదారులు బెదిరిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ఎన్నో కుటుంబాలను బయటికి వెళ్లమంటే ఎలా వెళ్లాలి. మా సమస్యను గుడిపాల తహసీల్దార్‌కు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. ఏ మాత్రం పట్టించుకోనే లేదు. గతంలో సమస్యలేమున్నా సచివాలయంలోనే పరిష్కారమయ్యేవి. సచివాలయ ఉద్యోగులే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి న్యాయం చేసేవారు. ఇప్పుడు మండల అధికారులే పలకడం లేదు.

- రాజేశ్వరి, గుడిపాల మండలం



పింఛన్ కోసం ఇంత దూరమొచ్చా

మాది సదుం మండలం. నేను గతంలో వైఎస్సార్ కడప జిల్లాలో ఉండేవాడిని. ఆ జిల్లాలో నాకు దివ్యాంగ పింఛన్ వచ్చేది. ప్రస్తుతం కుటుంబ పరిస్థితులతో చిత్తూరు జిల్లాలోని సదుంలో స్థిరపడ్డాను. పింఛన్ మార్పు చేసి న్యాయం చేయాలని మండల అధికారులను వేడుకున్నాను. న్యాయం జరగలేదు. గతంలో నాకు దివ్యాంగ పింఛన్ ను మంజూరు చేసేందుకు సచివాలయ ఉద్యోగులే సహాయం చేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో కలెక్టర్ సారుకు చెప్పుకుంటే న్యాయం జరుగుతుందని దూరాభారం వచ్చాను.

- వెంకటరామయ్య, సదుం మండలం



గతంలో మా ఊళ్లోనే సమస్యలు పరిష్కారం

మాది గంగాధరనెల్లూరు మండలం ఎల్లమరాజుపల్లె. గత ప్రభుత్వంలో పింఛన్ సమస్యలు, సంక్షేమ పథకాల సమస్యలన్నీ మా గ్రామ సచివాలయంలోనే పరిష్కరించేవారు. ఇప్పుడేమో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు సర్వేలు అంటూ ఊరూరా వెళ్లిపోతున్నారు. నా భర్త మృతి చెందడంతో గత 15 ఏళ్లుగా వితంతు పింఛన్ పొందుతున్నాను. నేను కిందపడిపోవడంతో కాళ్లల్లో సత్తువ లేదు. 80 శాతం వైకల్యం ఉండడంతో దివ్యాంగ పింఛన్ కోసం వినతిపత్రం ఇచ్చేందుకు ఇంత దూరం వచ్చాను. న్యాయం జరుగుతుందో లేదో అర్థం కావడం లేదు.

- శారద, గంగాధరనెల్లూరు మండలం



రేపటి 'యువతపోరు'కు తరలిరండి

- మాజీ మంత్రి పెద్దిరెడ్డితోపాటు నియోజకవర్గ సమన్వయకర్తల రాక
- పోస్టర్‌ను ఆవిష్కరించిన చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను ఘోరంగా మోసం చేసి, నట్టేట ముంచిందని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆరోపించారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులతో కలిసి యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఇటీవల నియోజకవర్గంలో పదవులు పొందిన నాయకులతో కార్యక్రమం సమయాత్తంపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అమూల్ డెయిరీ వద్దకు చేరుకుంటామన్నారు. అనంతరం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి ర్యాలీగా వేలాది మందితో కలెక్టరేట్ వద్దకు చేరుకుంటామన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగభృతి ఇవ్వాలని, మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం ఉపసంహరించుకోవాలన్న ప్రధాన డిమాండ్లతో ధర్నా చేస్తామని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ప్రభుత్వం వారిని ఇబ్బందులు పెడుతుందని చెప్పారు. విద్యార్థులకు అండగా నిలవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు యువతపోరుకు సమాయత్తమవుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ తుగ్లక్ పాలనలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గాయత్రీదేవి, లీనారెడ్డి విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జనజీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రజలను మభ్యపెట్టే మాటలతో మంత్రి నారా లోకేష్ కాలయాపన చేస్తున్నారని పార్టీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మండిపడ్డారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా జగనన్న పాలన సాగించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సజావుగా అందేవని పార్టీ చిత్తూరు నగర, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల అధ్యక్షులు కేపీ శ్రీధర్, ప్రకాష్, జయపాల్ గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యార్థుల అభ్యున్నతికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, పార్టీ మహిళ విభాగం చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షురాలు అంజలిరెడ్డి, యువజన విభాగం చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు విష్ణు, నాయకులు స్టాన్లీ, భాగ్యలక్ష్మి, నారాయణ, మనోహర్‌రెడ్డి, హరీషారెడ్డి, రమణ, నౌషద్, రంజిత్, రాజేష్, అజిత్, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గుడిపాలలో ఒంటరి ఏనుగు

భయాందోళనలో ప్రయాణికులు

గుడిపాల: మండలకేంద్రం పరిసరాల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తోంది. తమిళనాడు నుంచి సోమవారం గుడిపాల అటవీప్రాంతానికి వచ్చినట్టు తెలిసింది. సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని భద్రకాళమ్మ దేవాలయం సమీపంలోకి ఒంటరి ఏనుగు రావడంతో స్థానికులు చూసి భయాందోళన చెందారు. అనంతరం స్థానికులు గుమికూడి కేకలు పెట్టడంతో కొంతసేపు జాతీయ రహదారి పక్కనే ఉండి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. వెంటనే అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి, బీట్ ఆఫీసర్ ఢిల్లీరాణి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు జబిల్లా, అరుణతో పాటు సిబ్బంది అక్కడికి వెళ్లి ఒంటరి ఏనుగు ఉండడాన్ని గుర్తించారు. వెంటనే బాణసంచా పేల్చి అటవీప్రాంతంలోకి తరిమివేశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా ఒంటరి ఏనుగును తిరిగి తమిళనాడు వైపు తరలించేందుకు చూస్తున్నామని వారు తెలిపారు.

● తెప్పపై శ్రీకృష్ణ స్వామి అభయం



శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. పుష్కరిణిలో మూడుసార్లు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మూడో రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. - తిరుమల

బోయకొండకు రూ.2.96 కోట్ల ఆదాయం

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ దేవస్థానానికి వద్ద వివిధ రకాల వేలం పాటల లీజు ద్వారా రూ.2.96 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. సోమవారం బోయకొండ ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వేలం పాటలు జరిగాయి. ఈ వేలం పాటలకు రూ.5లక్షల ధరావత్తు చెల్లించిన 18 మంది పాటదారులు మాత్రమే పాల్గొన్నారు. బయట ప్రాంత వ్యక్తులు పాల్గొనకపోగా స్థానికులు మాత్రమే వేలం పాటలు, టెండర్లలో పాల్గొన్నారు. గతంలో వచ్చిన వేలం పాట ఆదాయంలో నామమాత్రపు ఆదాయాన్ని రెట్టింపు చేస్తూ ముందే నిర్ణయించిన మేరకు వేలం పాటలు ముగించేశారని ఆరోపణలు వచ్చాయి. కొండపైన కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయించుకునే హక్కు ద్వారా రూ.52.50లక్షలు శివకుమార్ సొంతం చేసుకున్నారు. కొండపై పూల హారాలు, నిమ్మకాయల హారాలు, వడిబాల సామగ్రి, చీరలు, జాకెట్ పీసులు విక్రయించుకునే హక్కు ద్వారా రూ.42 లక్షలు రాగా గణపతి దక్కించుకున్నారు. దేవస్థానం టోల్ గేటు నిర్వహణ హక్కును రూ.68.50 లక్షల హెచ్చుపాటతో రమణ కైవసం చేసుకున్నారు. పెద్దభోగం, చిన్న భోగం సేకరణ హక్కును రూ.86.15 లక్షలతో వెంకటేష్, భక్తులు సమర్పించే చీరలు, రవికలు, పావడా పీసులు సేకరణ హక్కును రూ.46.50లక్షలకు గంగులప్ప సొంతం చేసుకున్నారు. అలాగే భక్తులు సమర్పించు తలనీలాలు సేకరణ హక్కు, కొండపై క్లాక్ రూము నిర్వహణ హక్కులకు నిర్వహించిన వేలం పాటలు సరైన మద్దతురాని కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఈఓ ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ సోని, ఇన్‌స్పెక్టర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



బోయకొండలో వేలం పాటలను నిర్వహిస్తున్న ఈఓ ఏకాంబరం

క్లుప్తంగా

వైద్యవిధాన పరిషత్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్‌లోని ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ ప్రభావతి తెలిపారు. పలు విభాగాల్లో మొత్తం 26 ఖాళీలున్నాయన్నారు. ల్యాబ్ అసిస్టెంట్ 1, రేడియోగ్రాఫర్ 2, బయోస్టేటిష్టియన్ 1, రికార్డ్ అసిస్టెంట్ 1, ల్యాబ్ అటెండెంట్ 1, థియేటర్ అసిస్టెంట్ 5, పోస్టుమార్టం అసిస్టెంట్ 6, ప్లంబర్ 2, జనరల్ డ్యూటీ అటెండెంట్ 6, ఎలక్ట్రీషియన్ 1 చొప్పున్న ఖాళీలున్నాయన్నారు. అర్హతతో పాటు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అవగాహన పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ శాఖల అవగాహన పోస్టర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి సోమవారం ఆవిష్కరించారు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న పీ4 పోస్టర్లను, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్లకోమా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత వెనుకపడిన 20 శాతం కుటుంబాలకు సహాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ4 కార్యక్రమం చేపడుతోందన్నారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, సాంబశివారెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి, డీబీసీఎస్ డాక్టర్ అర్పిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి వైఎస్సార్ సీపీ నేత పరామర్శ



శంకరయ్య పార్థివ దేహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెదురుకుప్పం: మండలంలోని బలిజమొండివెంగనపల్లెకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. భాస్కర్ తండ్రి శంకరయ్య సోమవారం వేకువజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, మాజీ ఎంపీపీ జ్ఞానమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టీ సుబ్రమణ్యం ఆ గ్రామానికి చేరుకుని, భాస్కర్‌ను పరామర్శించారు. అనంతరం శంకరయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.రామయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, వెదురుకుప్పం మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డి, వెంకటేశ్, వాసు ఉన్నారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

పుంగనూరు: పట్టణంలోని మేలుపట్లలో అక్రమంగా విక్రయిస్తున్న 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేలుపట్ల గ్రామానికి చెందిన బాలాజీ, భగత్‌సింగ్‌కాలనీకి చెందిన శివకుమార్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇందులో శివకుమార్ పరారీ కాగా, బాలాజీ అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నీ శరణిదే జొచ్చితిని!

సంగీత తపస్వి గరిమెళ్ల

- అన్నమయ్య సంకీర్తనలే జీవితం
- రాగాలద్ది.. వైవిధ్యభరితంగా జనబాహుళ్యంలోకి
- భిన్నస్వరాలతో బాణీలు
- ఆయన లేని లోటు తీర్చలేనిదంటున్న సంగీత ప్రియులు



డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (ఫైల్)



టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ పార్థివ దేహం



గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (ఫైల్)



తన గురువు విద్వాన్ నేదునూరి కృష్ణమూర్తితో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

తిరుపతి కల్చరల్: సంగీత తపస్వి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. ఆయన ఆధ్యాత్మికత సుపరిమళ గుబాళింపుగా ప్రాశస్తి చెందిన అన్నమయ్య సంకీర్తనలనే జీవితంగా మలుచుకున్నారు. తన స్వర కీర్తనలతో అలరారింపజేశారు. రాగాలనద్ది, వైవిధ్యభరితంగా బాణీలు కట్టారు. భిన్నమైన స్వర ప్రయోగాలతో సాహిత్య అభిమానులను సంగీత సాగరంలో ముంచెత్తారు.

తుది శ్వాస వరకు..

గరిమెళ్ల భార్య రాధ. ఆయన కుమారులు అనిల్ కుమార్, పవన్ కుమార్. నిత్య సంగీతార్చనతో తన ఆధ్యాత్మిక భక్తి పారవశాన్ని చాటుకున్నారు. తుది శ్వాస వరకు సంగీతోపాన్యాసం చేస్తూ నాద యోగిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

వైవిధ్య బాణీలు

రాగమే ధ్యాసగా.. ఆధ్యాత్మిక సంగీతమే జీవితంగా పయనిస్తూ వెయ్యికి పైగా అన్నమాచార్య సంకీర్తనలను పండిత పామర జనరంజకంగా శాస్త్రీయ లలిత, జానపద బాణీలలో స్వరపరిచారు. అన్నమయ్య కీర్తనల సాహిత్య పరిమళాలను విస్తరింపజేశారు. బహుళ ప్రచారంలో మోహన, హంసధ్వని, శంకరాభరణం, తోడి, కల్యాణి, మాయామాళవగౌళ రాగాలను సరళమైన పద్ధతిలో స్వరపరిచారు. అన్నమాచార్య సంకీర్తనలను భావయుక్తంగా తన గళంలో పలికించేందుకు వీలుగా ఆయా సంకీర్తనలలోని సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి దానికి తగిన రాగాలను స్వరబాణీలను సమకూర్చారు. అంతేగాక రతిపతిప్రియ, వరం, నటహిందోళం, శివరంజని, పాడి, మిశ్రవకుళాభరణం వంటి రాగాల్లో ఆయన స్వర పరిచన సంకీర్తనలు అలరింపజేశాయి. సుందరంజని, సుమశ్రీసుకామవర్ధని, సుమగంధి, సునాదనంది, సత్యప్రియ, సంజీవి, సింధుప్రియ, శ్యామకాంభోజి ,వాణీప్రియ, చిత్రకల్యాణి, నిషాది, ప్రసూన, కోమలి వంటి సుమారు 20 అపూర్వ రాగాలను సృష్టించి అందులో కీర్తనలను రచించి పుస్తకాలుగా, ఆడియో రూపంలో తీసుకువచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సప్తగిరి సంకీర్తనల గోష్టి గానాన్ని ప్రచారం చేసిన ఘనత గరిమెళ్లకే దక్కింది.

విశేష పురస్కారాలు

గరిమెళ్ల చేసిన సంగీత యజ్ఞ ప్రతిభకు విశేష పురస్కారాలు వరించాయి. అన్నమాచార్య సంకీర్తన మహతి, హరికీర్తనాచార్యులతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు ఆధ్యాతిక సంస్థల పురస్కార సత్కారాలు అందుకున్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. శ్రీపొట్టి శ్రీరాముల తెలుగు వర్సిటీ నుంచి విశిష్ట పుస్కారంతో పాటు రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్నారు.

కళా నీరాజనం

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పలువురు ప్రముఖులు, కళాకారులు సోమవారం నివాళి అర్పించారు. ఇందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు, రాయలసీమ రంగస్థలి కళాకారులు, టీటీడీ అన్నదానం డెప్యూటీ ఈవో రాజేంద్రకుమార్, డీపీపీ కార్యదర్శి, అన్నమయ్య వంశీయులు హరినారాయణదాస, ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఉన్నారు.

స్వర మాధుర్యం..ప్రతిభ అపారం

సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి శిష్యరికంతో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మరింత రాటుతేలారు. శాస్త్రీయ, ఆధ్యాత్మిక గాయకుడుగా గరిమెళ్ల 1978లో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడుగా ప్రవేశించారు. అపార ప్రతిభతో టీటీడీ ఆస్థాన విద్యాంసుడుగా ఎదిగారు. టీటీడీ ఆస్థాన పండితుడుగా అన్నమయ్య కీర్తనలను స్వపరపరిచి ఆలపించారు. తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సంకీర్తన నైవేద్యాన్ని సమర్పించారు. రాజమండ్రిలో 1946 నవంబర్ 9వ తేదీన కృష్ణవేణి, నరసింహారావు దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి నరసింహారావు విద్యాంసుడు. ప్రముఖ సినీ గాయని జానకి స్వయాన పిన్నమ్మ కావడంతో చిన్నప్పటి నుంచి ఆయన సంగీతం పట్ల ఆసక్తితో అంచెలంచెలుగా ఎదిగారు. చివరి దశలో తిరుపతిలో స్థిరపడ్డారు.



తన పిన్ని ప్రముఖ సినీ గాయని జానకితో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

పుత్తూరు తైలం పేరిట బురిడీ

- రూ.లక్షలు ముంచిన ఘనుడు!
- కొన్నాళ్లుగా పలమనేరులో కార్యాలయం మూత
- అడ్రస్‌లేని నిర్వాహకుడు
- లబోదిబోమంటున్న బాధితులు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

పలమనేరు: పుత్తూరు తైలం పేరిట ఫ్రాంఛైజీలు పేరిట ఓ వ్యక్తి రూ.లక్షల్లో వసూలు చేసి, జనాన్ని బురిడీ కొట్టించిన సంఘటన పలమనేరులో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బాధితుల కథనం మేరకు... రవికుమార్ రాజు అనే వ్యక్తి తాను పుత్తూరు తైలం ప్రొడక్ట్ ఎండీనని ఉమ్మడి ఏపీలో ప్రచారం చేసి, పలువురికి ఫ్రాంఛైజీలు ఇస్తామంటూ నమ్మబలికాడు. ఒక్కో జిల్లాలో ఏజెన్సీ కోసం రూ.2 లక్షలు డిపాజిట్‌గా చెల్లించాలని, అమ్మిన బాటిళ్లపై రూ.10 వరకు కమీషన్ ఉంటుందని తెలిపాడు. దీంతో అతని మాటలు నమ్మి తెలంగాణకు చెందిన ఆనంద్, విజయవాడకు చెందిన వేణువర్ధన్‌రెడ్డి రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. వీరికి కొన్ని నెలలపాటు తైలం పంపి, వారికి కమీషన్లు సక్రమంగా చెల్లించి, ఆపై సరుకు ఇవ్వకుండా పోయాడు. దీంతో వారు రవికుమార్ రాజుకు ఫోన్ చేసినా అది స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీంతో బాధితులు ఇటీవల పట్టణంలోని రాధా బంగ్లాలోని పుత్తూరు తైలం కార్యాలయాన్ని గమనించగా దానికి కొన్ని నెలల నుంచి తాళం వేసి ఉందని తెలుసుకున్నారు. చేసేది లేక వారు పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి రవికుమార్‌రాజు భార్య సునీతను అడగ్గా తనకు సంబంధం లేదని చెప్పినట్టు బాధితులు తెలిపారు. తమలాంటి వారు ఉమ్మడి ఏపీలో చాలామంది ఉన్నారని, మొత్తం రూ.కోట్లలో మోసం జరిగిందని ఆరోపించారు. పలమనేరులో భారీ భవంతి, ఇంటి సైట్లు కొని ఇప్పుడు కనిపించకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ ఇక్కడి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మరోవైపు ఇక్కడి పుత్తూరు తైలం కార్యాలయంలో పనిచేసిన పట్టణానికి చెందిన సిబ్బందికి సైతం వేతనాలివ్వలేదని తెలిసింది.

సిబ్బంది కొరతతోనే నియంత్రించలేకున్నాం!

- ఒంటరి ఏనుగు అత్యంత ప్రమాదకరం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని
- అటవీశాఖ అధికారుల సూచన



సమావేశంలో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

యాదమరి: తగిన సిబ్బంది లేకపోవడంతోనే ఏనుగులను నియంత్రించలేకపోతున్నామని, ప్రజలు అర్థం చేసుకోవాలని చిత్తూరు పశ్చిమ విభాగ అటవీ శాఖాధికారి డీఎఫ్ఓ సాకేత్ గరుడ పేర్కొన్నారు. యాదమరి మండలంలోని జోడిచింతల అటవీ శాఖ తనిఖీ కేంద్రం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదమరి, బంగారుపాళెం మండలంలోని పలు ప్రాంతాలపై ఏనుగుల సంచారం ఉందన్నారు. ఈ క్రమంలో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. అలాగే ప్రజలపై కూడా దాడి చేస్తున్నాయన్నారు. ఈ రెండు మండలాల్లో అటవీ పరిధి దాదాపుగా 50 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందన్నారు. ఇందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో కేవలం ఏడుగురు సిబ్బందితో ఏనుగును నియంత్రించలేకపోతున్నామన్నారు. తద్వారా జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వెలుతురు చెరువు, తాళ్లమడుగు, భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టు సమీపంలో దాదాపు 25 ఏనుగులు వరకు సంచరిస్తున్నాయని తెలిపారు. ఈ పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యకలాపాలను ముగించుకుని, ఇళ్లకు చేరాలని విజ్ఞప్తి చేశారు. అనివార్య పరిస్థితుల్లో గజదాడుల్లో నష్టపోయిన, ప్రాణనష్టం జరిగినా ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. తాజాగా ఏనుగుల దాడిలో గాయపడిన దళవాయిపల్లి యువకుని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో మోహన మురళీ, డీఆర్వో ఆనందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటకలో చోరీ.. ఓజీకుప్పం వాసి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు

రూ. 30 లక్షల నగదు స్వాధీనం

నగరి : కర్ణాటక, హావేరిలో రూ.30 లక్షలు చోరీ చేసిన సంఘటనలో ఓ వ్యక్తిని ఓజీ కుప్పం గ్రామంలో పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక, హావేరిలో రూ.30 లక్షలు చోరీ కేసులో నగరి మండలం ఓజీ కుప్పం వాసి నిందితుడిగా అక్కడి పోలీసులు గుర్తించారు. దీంతో వారు నగరి డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్‌ను సంప్రదించారు. నగరి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చోరీ కేసుల ఆధారంగా స్థానిక పోలీసుల సహకారంతో ఓజీకుప్పం గ్రామంలో దాడులు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు రోజులు గాలింపు చర్యలు చేపట్టి, చోరీకి పాల్పడిన జగదీష్(35) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని కర్ణాటక పోలీసులకు సోమవారం అప్పగించారు. నిందితుడిని గుర్తించడంలో సహకరించిన డీఎస్పీతోపాటు పోలీసులకు కర్ణాటక పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు ఆలకించండి సారూ!

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి
- వివిధ సమస్యలపై 167 అర్జీలు నమోదు



ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : 'దూర ప్రాంతాల నుంచి విచ్చేశాం..మా సమస్యలు పరిశీలించి న్యాయం చేయండి.. సారూ' అని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందజేసిన వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు 167 అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేయండి

వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డును నిర్మించాలని శ్రీరంగరాజపురం మండలం ఉడమలకుర్తి వాసులు కోరారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. శ్మశానవాటికకు దారి సౌకర్యం కల్పించాలన్నారు. తమ గ్రామానికి చెందిన చిన్నబక్కయ్య, ఆయన అనుచరులు జేసీబీతో శ్మశాన దారిని తవ్వేసి రాకపోకలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. న్యాయం చేయాలని కోరారు.



హిందువులపై దాడి అన్యాయం



నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో వీరభద్రస్వామి ఊరేగింపు యాత్రలో వెళుతున్న హిందువులపై దాడి చేయడం అన్యాయమని విశ్వహిందూ పరిషత్ నాయకులు సురేంద్రరెడ్డి, రామమూర్తి అన్నారు. ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి వీరభద్రస్వామి ఊరేగింపు యాత్రలో వెళుతున్న హిందువులపై దాడి చేసిన నిందితుల్ని వెంటనే అరెస్టు చేయాలన్నారు. దాడి జరిగి చాలా రోజులవుతున్నా నిందితుల్ని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీశ్వరనాయుడు, కొత్తూరుబాబు, ప్రభాకర్‌నాయుడు, వెంకటేష్, భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లాల్సిందే

తమ గ్రామానికి కాలినడకలో వెళ్లాల్సిందేనని పెనుమూరు మండలం విడిదిపల్లి హరిజనవాడ వాసులు వాపోయారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు గోవిందప్ప, నారాయణ, తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా విడిదిపల్లి హరిజనవాడలో నివాసం ఉంటున్నామన్నారు. పాలకులు గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నారే కాని తమ గ్రామానికి మాత్రం రోడ్డు వేయలేకపోతున్నారని చెప్పారు. చాలా ఏళ్లుగా తమ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో కాలినడకన వెళుతున్నామన్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



రోడ్డు సౌకర్యం కల్పించాలంటున్న విడిదిపల్లి దళితులు

ఏనుగుల దాడి నుంచి కాపాడండి



గజదాడుల నుంచి కాపాడాలని కోరుతున్న బంగారుపాళెం మండలవాసులు

ఏనుగుల దాడి నుంచి తమను కాపాడాలని బంగారుపాళెం మండలం రాగిమానుపెంట, కేఎంకండ్రిగ, వెలుతురు చేను, కీరమంద, కోదలమడుగు, బండ్లదొడ్డి తదితర గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆ గ్రామస్తులు రమేష్, రమణప్ప మాట్లాడుతూ గత 5 నెలల నుంచి తమ గ్రామాల్లో ఏనుగుల సంచారం ఎక్కువైందన్నారు. ఏనుగుల దాడిలో అరటి, మామిడి, టమాట తదితర పంటలు నష్టపోతున్నామన్నారు. పశువులపై ఏనుగులు దాడి చేసి చంపేస్తున్నాయన్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొలాల వద్ద పనులు చేసుకుంటున్నట్లు తెలిపారు.

ఎస్బీఐ అకౌంట్‌లో నగదు మాయం

- ఆందోళనలో ఖాతాదారులు
- రుణాలు తీసుకున్న వారి డబ్బు మాయం
- మాయంపై విచారణ జరపాలి



ఖాతాలలో డబ్బు మాయమైన బాధితులు

రొంపిచెర్ల: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్‌లో డబ్బులు మాయం అవుతున్నాయని ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. బ్యాంక్ ఖాతాదారులందరికీ ఖాతాలో నగదు డ్రా అయినట్లు మేసేజ్‌లు రావడంతో ఖాతాదారులు బ్యాంక్‌కు పరుగులు తీస్తున్నారు. మండలంలోని దద్దాలవారిపల్లెకు చెందిన మహేష్ ఖాతాలో రూ.20.500, శివప్రసాద్‌నాయుడు అకౌంట్‌లో రూ.8.555, ఫజులుపేటకు చెందిన జ్యోతిమ్మ ఖాతాలో రూ.9.555, మల్లికార్జున ఖాతాలో రూ.10 వేలు, రొంపిచెర్ల క్రాస్ రోడ్డుకు చెందిన మనోజ్ ఖాతాలో , రూ.3.600, నవీన్ ఖాతాలో రూ.3.800, కృష్ణమూర్తి ఖాతాలో రూ.6 వేలు మాయం అయినట్లు సోమవారం తెలిపారు. అయితే బ్యాంక్ అధికారులు చెప్పే మాటలకు పొంతన లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ ఖాతాలో డబ్బు తాము డ్రా చేయకనే ఎలా డ్రా అయిందని, ఎవరు డ్రా చేశారని, ఏ ఖాతాకు వెళ్లిందని బ్యాంక్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే తమకు ఎలాంటి సంబంధం లేదని సులువుగా బ్యాంక్ అధికారులు తప్పుకుంటున్నారు. ప్రైవేటు బ్యాంక్‌ల్లో రుణాల తీసుకుని సకాలంలో చెల్లించకపోతే అలస్యం రుసుం కింద డబ్బు డ్రా చేస్తారని బ్యాంకర్లు చెబుతున్నారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులకు పూర్తి బాధ్యత బ్యాంక్ అధికారులదే. అయితే బ్యాంక్ ఖాతాలలో డబ్బును సైబర్ క్రైమ్‌లో డ్రా చేస్తే పూర్తి వివరాలను ఖాతాదారులకు ఇవ్వాలి. వారు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేస్తారు. బ్యాంక్ ఖాతాలో డబ్బు ఎవరి ఖాతాకు మళ్లించారనే విషయం కూడా తెలియడం లేదు. మినీ స్టేట్‌మెంట్లు తీసుకున్న చూపించడం లేదని బాధితులు వాపోతున్నారు. తాము ఎక్కడ రుణాలు తీసుకోకపోయినా తమ డబ్బులు మాయం అయ్యాయని బోరున విలపిస్తున్నారు. డబ్బులు మాయం అవుతుంది ఒక్క రొంపిచెర్ల స్టేట్‌బ్యాంక్‌లోనే అని ఖాతాదారులు ఆరోపించారు. బ్యాంక్‌లో డబ్బు డ్రా చేయకనే డ్రా చేసినట్లు సెల్‌ఫోన్‌కు మేసేజ్‌లు రావడంతో ఖాతాదారులు బ్యాంక్‌కు పరుగులు తీస్తున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇప్పటికైన బ్యాంక్ అధికారులు, పోలీసులు రంగ ప్రవేశం చేసి డబ్బు మాయంపై విచారణ జరపాలని ఖాతాదారులు కోరుతున్నారు.

లాటరీ టికెట్ల వ్యాపారి అరెస్టు

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న షేక్‌అబ్దుల్‌వాహీద్‌ను అరెస్టు చేసి, రూ.1.40 లక్షలు విలువ చేసే టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు వాహీద్ ఇంట్లో దాడులు జరిపి రూ.1.40 లక్షలు విలువైన 700 టికెట్లు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. లాటరీ టికెట్లు ఎవరైనా విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ కోరారు.